

ప్రధాని ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి టీజీ భరత్



ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

ఓర్వకల్లు/ కర్నూలు అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు జిల్లాలో పర్యటన సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పరిశీలించారు. ఆదివారం మండలంలోని నన్నూరు గ్రామ సమీపంలో టోల్‌గేటు వద్ద ఉన్న రాగమయూరి సభా ప్రాంగణం ఏర్పాట్లను పరిశీలించి జరుగుతున్న పనులు, పెండింగ్‌లో ఉన్న పనులను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16న శ్రీశైలంలో మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవారి దర్శనానంతరం కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు వస్తారన్నారు. సభకు హాజరు కావడంతో వర్చువల్ విధానం ద్వారా వివిధ ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవం కార్యక్రమాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే ఏర్పాట్లు కూడా దాదాపు పూర్తి చేశామన్నారు. ప్రధానమంత్రి మోదీ పర్యటనను విజయవంతం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాని ఏర్పాట్లలో అధికారులు సమన్వయంతో పని చేసి పనులను పూర్తి చేయాలన్నారు. మంత్రి వెంట ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, టీడీపీ యువ నాయకుడు సోమిశెట్టి నవీన్, పునులూరు ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న పనులు



చకచకా

- ప్రధాని పర్యటన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం
- పదుల సంఖ్యలో ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు
- రంగంలోకి దిగిన కేంద్ర, రాష్ట్రస్థాయి బలగాలు
- నేటి సాయంత్రానికి పనులు పూర్తయ్యే అవకాశం

ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు, నంద్యాల జిల్లాల పర్యటన నేపథ్యంలో అధికారులు బిజీగా మారారు. ఓ వైపు అధికారులు, మరో వైపు కూటమి నాయకులు ఎవరికి వారు సమీక్షలు, సమాలోచనలు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులు కర్నూలులో మకాం వేశారు. కేంద్ర బలగాలు మూడు రోజుల నుంచి నల్లమల అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. కర్నూలు నగరాన్ని సైతం జల్లెడ పడుతున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కీలక నాయకులు తమ నేతలతో సమీక్షలు, జనసమీకరణపై దృష్టి పెట్టారు. ఐపీఎస్, ఐఏఎస్ అధికారులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం కర్నూలు, నంద్యాల కలెక్టర్లు డాక్టర్ సిరి, రాజకుమారి, డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీలు విక్రాంత్ పాటిల్, సునీల్ షెరాన్ ఉదయం నుంచే ప్రధాని పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రమిస్తున్నారు. సోమవారం సాయంత్రానికి పనులన్నీ పూర్తి చేసి ఆయా వేదికలు, ప్రదేశాలను ఎస్పీజీ, కేంద్ర బలగాలకు అప్పజెప్పేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

శ్రీశైలంలో పటిష్ట బందోబస్తు: ఎస్పీ

శ్రీశైలం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ 16న శ్రీశైలం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో జిల్లా పోలీసులు బందోబస్తును పెంచారు. ఈ బందోబస్తు ఏర్పాట్లను ఆదివారం ఎస్పీ సునీల్ షెరాన్ స్వయంగా పర్యవేక్షించారు. ప్రధాని పర్యటించే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే శ్రీశైలం పరిసర ప్రాంతాలను, నల్లమల అడవిని గ్రేహౌండ్స్ సాయుధ బలగాలు జల్లెడ పడుతున్నాయి. రెండు రోజుల నుంచి కేంద్ర బలగాలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఇదే క్రమంలో ప్రధాని పర్యటించే ప్రాంతాలైన హెలిప్యాడ్, రోడ్డు మార్గం, ఆలయం ఎదుట, అతిథి గృహం వద్ద, ఆలయ సమీపం తదితర ప్రాంతాలను ఎస్పీ సునీల్ షెరాన్ పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భద్రతలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఎస్పీ వెంట ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, సీఐలు ప్రసాద రావు, చంద్రబాబు తదితరులు ఉన్నారు.



ఆలయం ఎదుట భద్రతపై సూచనలిస్తున్న ఎస్పీ



చురుగ్గా జరుగుతున్న రోడ్డు పనులు



సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు



వీవీపీల పార్కింగ్ కోసం యంత్రాలతో శరవేగంగా ఏర్పాట్లు

విజయవంతం చేయండి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఓర్వకల్లు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ శ్రేణులకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఓర్వకల్లు మండల పరిధిలోని నన్నూరు గ్రామ సమీపాన గల టోల్‌గేటు వద్ద రాగమయూరి సభా ప్రాంగణం ఏర్పాట్లను అధికారులు, టీడీపీ నేతలతో కలిసి పరిశీలించారు. ప్రధాని పర్యటనను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు, వాహన సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, భూమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎంపీ నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, డీసీఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ జిల్లా ఇన్‌చార్జి తిక్కారెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, మంతెన సత్యనారాయణ రాజు, మీడియా కోఆర్డినేటర్ బి.వెంకటరాముడు, కేడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్మన్ మల్లికార్జున రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

దొంగతనాలతో ప్రజల బెంబేలు

- నంద్యాల టిడ్కో గృహాలపై దొంగల కన్ను
- రాత్రి సమయంలో విద్యుత్ వైర్లు, మీటర్లు చోరీ
- పట్టించుకోని పురపాలక, పోలీసు అధికారులు



మీటర్లను ఎత్తుకెళ్లిన దృశ్యం

వరుస దొంగతనాలతో నంద్యాలలోని ఎస్సార్బీసీ వద్ద ఉన్న టిడ్కో గృహాల నివాసితులు బెంబేలెత్తిపోతున్నారు. గృహాల కోసం ఏర్పాటు చేసిన మీటర్లు, వైర్లను ముఖ్యంగా ఖాళీ గృహాలను లక్ష్యంగా చేసుకొని దుండగులు రాత్రికి రాత్రే చోరీ చేస్తున్నారు. అక్కడ 1200 గృహాలు ఉండగా.. కేవలం 120 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. చాలా ఇళ్లలో ప్రజలు నివాసం లేరు. దీంతో ఇదే అదునుగా భావించిన దొంగలు ఇలాంటి ఇళ్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్తున్నారు. నిత్యం దొంగతనాలతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

నంద్యాల టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సార్బీసీ వద్ద ఉన్న టిడ్కో గృహాల్లో ఇటీవల దొంగతనాలు నిత్యం జరుగుతున్నాయి. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్లల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు, మీటర్లను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. దీంతో చాలా గృహాల్లో విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు చెబుతున్నారు. సుమారు రూ.4 లక్షలు విలువ చేసే వైర్లు, మీటర్లను ఎత్తికెళ్లినట్లు సమాచారం.

120 కుటుంబాలు నివాసం

ఎస్సార్బీసీ కాలనీలోని టిడ్కో సముదాయంలో 1200 వరకు నివాస గృహాలు ఉండగా.. 120 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడం కోసం వైరింగ్ చేశారు. అయితే దొంగలు వెనుక నుంచి మీటర్ల వద్ద జంక్షన్ బాక్సు వద్ద వైర్లను కట్ చేసి ఖాళీగా ఉన్న ఇళ్లలోకి చొరబడి వైర్లను ఎత్తుకెళ్తున్నారు. ఇలా దొంగలు తీగలు కట్ చేయడంతో అక్కడ నివాసం ఉండేవారు భయభ్రాంతులకు గురవుతున్నారు.

పట్టించుకోని పోలీసులు, పురపాలక అధికారులు

ఇళ్లల్లో దొంగతనాలు జరుగుతున్నాయని 20 రోజుల నుంచి పురపాలక అధికారులకు చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పోలీసుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పగా.. తామే చెబుతామని పురపాలక అధికారులు అంటున్నారని చెప్పారు. అయితే ఇక్కడ ఉన్న వాచ్‌మన్ నిఘా కొరవడం కూడా దొంగతనాలకు కారణమని వారు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో పోలీసులు గస్తీ చేపట్టాలని కోరుతున్నారు.

పట్టణంలోని దుకాణాల్లో విక్రయం?

నంద్యాలలో ఇలా దొంగతనంగా తీసుకువచ్చిన వాటిని కొనుగోలు చేయడానికి ప్రత్యేకంగా కొన్ని దుకాణాలు ఉన్నాయి. వాటిలో సాయిబాబా నగర్‌లోని ఒక దుకాణం, నంద్యాల పట్టణ శివారుల్లో ఒక దుకాణం ఉన్నట్లు సమాచారం. దీంతో అక్కడ ఎటువంటి వస్తువులైనా, వైర్, ఇనుము, కాపర్ వాటిని వారి నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం.



ఇళ్లకు వెళ్లే వైర్లను కట్ చేసి ఎత్తుకెళ్లిన దృశ్యం

రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నాం



రెండు వారాలుగా దొంగలు రాత్రి సమయంలో వస్తున్నారు. దీంతో ఒంటరిగా ఉండాలంటే చాలా భయంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- దస్తగిరమ్మ, టిడ్కో నివాసి, నంద్యాల

చర్యలు తీసుకుంటాం



టిడ్కో ఇళ్లల్లో జరిగే దొంగతనాలతో అక్కడి జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ సెక్యూరిటీ పెంచి వారికి రక్షణ కల్పిస్తాం. అలాగే ఈ దొంగతనాలపై కూడా పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. రాత్రి సమయంలో గస్తీ కూడా పెంచాలని కోరాం.

- బండి శేషన్న, మున్సిపల్ కమిషనర్, నంద్యాల

ప్రధాని పర్యటనను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 16వ తేదీన నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేద్దామని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయం ఆవరణలో ఆదివారం నియోజకవర్గంలోని 5 మండలాల టీడీపీ బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయి ఇన్‌చార్జిలు, బీజేపీ, జనసేన పార్టీ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు నటేశ్ చౌదరి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి హాజరయ్యారు. మంత్రి బీసీ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో పరిశ్రమలు, పెట్టుబడులు వస్తున్న క్రమంలో ప్రధాని చేతులమీదుగా వాటిని ప్రారంభించే లక్ష్యంతో ఇక్కడ సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి జీఎస్టీ తగ్గింపు వల్ల రూ.2లక్షల కోట్లు ఆదాయం పడిపోయినా ప్రజా సంక్షేమం కోరి జీఎస్టీ తగ్గించారన్నారు. జీఎస్టీ తగ్గింపు విషయం ప్రజల్లోకి తీసుకోవాల్సిన బాధ్యత కూటమి నాయకులపై ఉందన్నారు. శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామిని ప్రధాని దర్శించుకోనున్నట్లు తెలిపారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. పార్టీ పరిశీలకుడు అశోక్‌రెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణల తర్వాత తొలిసారి ప్రధాని ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. పార్టీ అధిష్ఠానం నిర్దేశించిన లక్ష్యానికి మించి జనసమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు అంబాల రామకృష్ణారెడ్డి, కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, కాట్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కానాల కేశవరెడ్డి, బురానుద్దీన్, టంగటూరు శ్రీనయ్య, నంద్యాల రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి, కాశీంబాషా, భూషన్న, కోటపాడు శివరామిరెడ్డి జనసేన భాస్కర్, బీజేపీ నాయకుడు శరత్‌చంద్రకుమార్ పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు: ఎస్పీ

నంద్యాల టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరగాల్సిన పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు ఎస్పీ సునీల్ షెరాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలు గమనించి రావద్దని సూచించారు. 20వ తేదీ యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

శ్రీశైలం డ్యాంలో 215 టీఎంసీల నీటి నిల్వ

- ఒక గేటు ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలుగా ఉంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి 884 అడుగులుగా నమోదు అయింది. వరద ప్రవాహం కొనసాగుతుండడంతో 1 గేటు నుంచి ఇంజనీర్లు స్పిల్‌వే ద్వారా దిగువ సాగర్‌కు 27,891 క్యూసెక్కుల నీటిని సాగనంపుతున్నారు. శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం 62,457 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎగువ జూరాల విద్యుత్ ఉత్పత్తి అనంతరం 45,587, సుంకేసుల నుంచి 8,892 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్ర పరిసరాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల రద్దీ దృష్ట్యా శని, ఆది, సోమవారాలలో ఆర్జిత అభిషేకాలు, కుంకుమార్చన నిలిపివేశారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. భక్తులు పాతళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి తలనీలాలు సమర్పించారు. ఆన్‌లైన్ వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లు ముందస్తుగా తీసుకున్న భక్తులకు విడతలు వారిగా స్పర్శ దర్శనానికి అధికారులు అనుమతించారు. ఆలయ క్యూలైన్లన్నీ నిండిపోవడంతో మల్లన్న దర్శనానికి గంటల సమయం పట్టింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు.



రూ.13,429 కోట్లు.. 16 ప్రాజెక్టులు..!

● 16న శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ ● ఆయా శాఖల పనులతో తాత్కాలిక జాబితా సిద్ధం

వాహనాల మళ్లింపు ఇలా:

- ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం ఏరియాల నుంచి వచ్చే వాహనాలను నాగులాపురం దగ్గర ట్రాఫిక్ మళ్లింపు.
- బస్తిపాడు, చిన్నటేకూరు, తడకనపల్లె మీదుగా నన్నూరు రాగమయూరి దగ్గర ఏర్పాట్లు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకోవాలి.
- డోన్, ప్యాపిలి, తుగ్గలి, పత్తికొండ ఏరియాల నుంచి వచ్చే వాహనాలు నేషనల్ హైవేకు వచ్చి తడకనపల్లి మీదుగా నన్నూరు రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకోవాలి.
- కర్నూలు మీదుగా వచ్చే వాహనాలు నన్నూరు టోల్‌గేట్ దాటి తర్వాత రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన ప్రదేశానికి చేరుకోవాలి.
- నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె ఏరియాల నుంచి వచ్చే వాహనాలు నంద్యాల రోడ్డులో వచ్చి రాగమయూరి పార్కింగ్ దగ్గర ఏర్పాటు చేసిన ప్రదేశానికి రావాలి.

కర్నూలు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఈ నెల 16న కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించనున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరు అవుతున్నారు. కర్నూలు నగర శివారులో ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్‌ప్లాజా దగ్గర రాగమయూరి వెంచర్‌లో జరిగే జీఎస్టీ-2.0 సంస్కరణలు, ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించే సభలో ప్రధాని మోదీ పాల్గొనబోతున్నారు. జాతీయ రహదారులు, రైల్వే, రక్షణ, పారిశ్రామిక, పవర్, ఇంధన.. వంటి శాఖ దాదాపు రూ.13,429 కోట్ల అంచనాలతో నిర్మించబోయే 16 ప్రాజెక్టులను ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అధికారులు సన్నహాలు చేస్తున్నారు. ఏఏ ప్రాజెక్టులు శంకుస్థాపన చేయాలో ఓ కొలిక్కి వచ్చినా అధికారికంగా ప్రటించాల్సి ఉంది. ఈ రెండు రోజుల్లో గుర్తించిన ప్రాజెక్టుల్లో మార్పులు చేర్పులు, కొత్తగా ఇతర ప్రాజెక్టులు కూడా చేర్చే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ముఖ్యంగా కర్నూలు జిల్లాలో హైదరాబాద్ - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా రూ.2,786 కోట్లలో అభివృద్ధి చేయనున్న ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే టెండర్లు కూడా పిలిచారు. కర్నూలు పీఎస్-3 వద్ద పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టుల కోసం అదనపు పవర్ గ్రిడ్‌కు రూ.2,886 కోట్లతో శంకుస్థాపన చేయనున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల అంచనా విలువ రూ.5,672 కోట్లు. పక్కనే ఉన్న కడప జిల్లాలో విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా కొప్పర్తి ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి కోసం రూ.2,136 కోట్లతో టెండర్లు పలిచారు. ఈ ప్రాజెక్టుకు కూడా ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది. ప్రధాని శంకుస్థాపన చేయబోయే ప్రాజెక్టులో మెజార్టీగా జాతీయ రహదారులు, రైల్వే శాఖ పనులు ఉన్నాయి. ఈ నెల 6న జరిగిన ఓ సమావేశంలో కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలో ప్రతిపాదించిన డ్రోన్ సిటీకి 16న ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారని, ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అయితే.. ప్రధాని మోదీ శంకుస్థాపన చేసే ప్రాజెక్టుల జాబితాలో డ్రోన్ సిటీ లేదు. తుది జాబితాలో పేరు చేరుస్తారా..? డ్రోన్ సిటీకి శంకుస్థాపన వాయిదా వేస్తారా..? అంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

16న ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్న ప్రాజెక్టులు, అంచనా విలువ

ప్రాజెక్టు	అంచనా విలువ (రూ.కోట్లలో)
కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి	2,786
కడప జిల్లా కొప్పర్తి ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి	2,136
సబ్బవరం - షీలానగర్ వరకు ఎన్‌హెచ్-516సీ 6 లైన్	964
కొత్తవలస - విజయనగరం 35 కి.మీ.లు రైల్వే లైన్	493
పెందుర్తి - సింహాచలం ఉత్తరం మధ్య రైల్వే ఫ్లైఓవర్ లైన్	184
కర్నూలు-3 వద్ద పవర్‌గ్రిడ్ ట్రాన్మిషన్	2,886
ఎన్‌హెచ్-71లో పీలేరు-కాలూరు సెక్షన్ నాలుగు లైన్ల రోడ్డు	593
ఎన్‌హెచ్-1678లో కడప/నెల్లూరు సరిహద్దు - సీఎస్‌పురం వరకు 2 లైన్ విస్తరణ	286
ఎన్‌హెచ్-165లో గుడివాడ - మచిలీపట్నం మధ్య రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం	98
ఎన్‌హెచ్-716లో పాపాఘ్ని నదిపై 10వ ప్రధాన వంతెన నిర్మాణం	82
ఎన్‌హెచ్-565పై 11 కనిగిరి బైపాస్ నిర్మాణం	70
ఎన్‌హెచ్-544డీడీ పరిధిలో ఎన్.గుండ్లపల్లి ఫేస్‌లో బైపాస్ సెక్షన్ మెరుగుదల	13
అడ్వాన్స్‌డ్ నైట్ విజన్ ప్రాడక్ట్ ఫ్యాక్టరీ - రక్షణ ఉత్పత్తులు	362
శ్రీకాకుళం అంగుల్ నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ (మెయిన్‌లైన్)	1,730
చిత్తూరులో 15 ఎల్‌పీజీ బ్లాస్టింగ్ ప్లాంట్	200
కొత్తవలస-బొద్దవార, 33 కి.మీలు, షిమిలిగుడ-గోరపు సెక్షన్ 22 కి.మీ.లు రైల్వేలైన్	546
మొత్తం	13,429

ప్రధాని పర్యటనకు 7,300 మంది పోలీసులు

● కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు 7,300 మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు. ఆదివారం భద్రతా ఏర్పాట్లపై బందోబస్తు నిమిత్తం వచ్చిన సెక్టారు పోలీసు ఉన్నతాధికారులు, లైజనింగ్ ఆఫీసర్లతో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్షన్స్ గురించి జియో గ్రాఫికల్ మ్యాప్‌ను చూపిస్తూ మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా కేటాయించిన పార్కింగ్ ఏరియాలలో వారి వాహనాలను ఏర్పాటు చేసుకునే విధంగా చేయాలన్నారు. అలాగే పార్కింగ్ ప్రాంతాల్లో ఇండికేషన్ సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అఫిషియల్స్‌కు నెంబర్ 2 పార్కింగ్ ఏరియాను కేటాయించామన్నారు. ప్రతి సెక్టారు ఇన్‌చార్జి పోలీసు ఉన్నతాధికారులకు, లైజనింగ్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆయా జిల్లాల ఎస్పీలు పరమేశ్వరరెడ్డి, దేవరాజ్, మాధవ రెడ్డి, దీపికా పాటిల్, జి.కృష్ణకాంత్, కృష్ణకాంత్ పటేల్, శ్రీనివాసరావు, మణికంఠ చందవోలు, ధీరజ్ కునుబిల్లి, షెల్కే నచికేత్ విశ్వనాథ్, చక్రవర్తి, లక్ష్మీ నారాయణ, ట్రైనీ ఐపీఎస్‌లు, అడిషినల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అధికారులతో మంత్రి బీసీ సమీక్ష



మాట్లాడుతున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ

బనగానపల్లె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాకు వస్తున్న ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేద్దామని ఇందుకు ప్రతి అధికారి సహకరించాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. బనగానపల్లె నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. ప్రధాని సభకు నియోజకవర్గం నుంచి హాజరయ్యే ప్రజలకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. అధికారులంగా సమన్వయంతో పనిచేసి సభకు హాజరయ్యే వారికి రవాణా, ఆహారం, తాగునీటి వంటి సదుపాయాలు విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా సభా వేదికకు ముందుగానే చేరుకునే విధంగా అధికారులు రవాణా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

అదుపుతప్పి కంటైనర్ బోల్తా

అవుకు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : అవుకు పట్టణం సమీపంలోని కొత్తకాల్వ వద్ద కంటైనర్ అదుపుతప్పి ఆదివారం బోల్తా పడింది. విజయవాడ నుంచి హిందూపురం వెళుతున్న కంటైనర్ అవుకు సమీపంలోని కొత్తకాల్వ దగ్గరకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

తమ్ముడి పెండ్లి పత్రికలు పంచడానికి వెళ్తూ...

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఓర్వకల్లు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తన తమ్ముడి పెండ్లి పత్రికలు పంచడానికి వెళ్తూ ప్రమాదవశాత్తూ అన్న మృత్యువాత పడిన సంఘటన కర్నూలు-చిత్తూరు రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... జాతీయ రహదారిపై ఓర్వకల్లు గ్రామ సమీపాన ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన షేక్ మహ్మద్ రఫీ (35) ప్రమాదవశాత్తు కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు హైదరాబాదు నుంచి స్వగ్రామమైన కాల్వకు వస్తుండగా.. ఓర్వకల్లు గ్రామ సమీపాన ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడటంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతుని తమ్ముడికి ఈ నెల 15న వివాహం జరగాల్సి ఉండగా.. పెండ్లి పత్రికలు తీసుకెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

చిప్పగిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన శివకుమార్(36) అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. అనంతపురం జిల్లా గుంతకల్లులో పొలంలో ద్విచక్ర వాహనంతో పాటు శివకుమార్ పడి ఉండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు శివకుమార్ మృతిపై ఆరా తీస్తున్నారు. నంచర్ల గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయం పూజారిగా ఉన్న శివకుమార్ తల్లిదండ్రులు పూజలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. శివకుమార్‌కు భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు.

ప్రాణం తీసిన నిద్రమత్తు

చెట్టును ఢీకొన్న కారు.. ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

ఆళ్లగడ్డ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలం గూబగుండం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మజీద్ హుసెన్(40) అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కమలాపురానికి చెందిన పిచ్చిరెడ్డి తిరుపతి మారుతి కార్ షో రూంలో సేల్స్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో హైదరాబద్‌లో కారు డెలవరీ ఇచ్చేందుకు తిరుపతి నుంచి బయలు దేరాడు. కడప వద్ద ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. ఆళ్లగడ్డ మండలం గూబగుండం వద్దకు రాగానే నిద్రమత్తులో చెట్టుకు అతి వేగంగా ఢీకొన్నాడు. దీంతో కారులో ప్రయాణిస్తున్న కడప జిల్లాకు చెందిన ప్యాసింజర్ మజీద్ హేసెన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పిచ్చిరెడ్డితోపాటు మరో ప్రయాణికుడు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం పోలీసులు ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి కేసు నమొదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి పంట అగ్నికి ఆహుతి

15 క్వింటాళ్లు నష్టం



చిరుమాన్ దొడ్డిలో కాలి పోయిన పత్తి

ఆస్పరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి అమ్మకానికి సిద్ధంగా ఉన్న సమయంలో పత్తి అగ్నికి ఆహుతైన ఘటన ఆదివారం మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొల్ల చంద్రశేఖర్ తనకున్న మూడు ఎకరాల పొలంలో పత్తి పంటను సాగుచేసి ఎకరాకు దాదాపుగా రూ.50 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేశారు. తీరా చేతికొచ్చి అమ్మాల్సిన సమయంలో దగ్ధమైంది. దాదాపుగా ఇంట్లో ఉన్న 15 క్వింటాళ్ల పత్తి అగ్గిలో కాలి బూడిదైంది. దీంతో రైతు తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

ఆళ్లగడ్డ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలం యాదవాడకు చెందిన అరుణ్‌కుమార్ అనే యువకుడు కడప జిల్లా దువ్వూరు వద్ద ఊరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యాదవాడకు చెందిన అరుణ్‌కుమార్(19) స్థానిక ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో రెండవ సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలికతో ప్రేమాయణం సాగించేవాడని స్థానికుల సమాచారం. ఈ విషయం బాలిక బంధువులకు తెలిసి ఇటీవల అరుణ్‌కుమార్ ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేశారు. దీంతో అరుణ్ కుమార్ తండ్రి మందలించడంతో ఇంటి నుంచి పరారయ్యాడు. ఆదివారం కడప జిల్లా దువ్వూరు సమీపంలో ఓ రేకుల షెడ్డులో ఉరి వేసుకుని యువకుడు మృతి చెందాడు. ఈ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కాళ్లు భూమికి అందేలా ఉండటం, ప్యాంట్ కిందికి జారి ఉండడంపై అనుమానం వ్యక్తం చేశారు. కడప జిల్లా దువ్వూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి యువకుడు గల్లంతు

బేతంచెర్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.పెండేకల్ గ్రామానికి చెందిన చిన్న పుల్లయ్య కుమారుడు చిన్న కుల్లాయి (25) అనే యువకుడు గ్రామ సమీపంలోని బావిలోకి ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. గల్లంతైన చిన్న కుల్లాయి కోసం పోలీసులు, ఫైర్ స్టేషన్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 4 గంటల సమయంలో ఈతకు వెళ్లి తిరిగి రాకపోవడంతో గ్రామస్థులు బావి వద్దకు వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. బావిలోని నీటిని డీజిల్ మోటారు ద్వారా తోడేస్తున్నారు. ఇంకా యువకుడి ఆచూకీ దొరకలేదని పోలీసులు తెలిపారు.

1 నుంచి కర్నూలు ఉత్సవ్

● తొలిసారిగా వారం రోజుల పాటు రాష్ట్ర అవతరణ సంబరాలు

● టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య



సమావేశంలో మాట్లాడుతున్న టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని చారిత్రక వైభవం, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య అంశాలను మేళవిస్తూ వారం రోజుల పాటు 'కర్నూలు ఉత్సవ్' పేరిట భారీ కార్యక్రమానికి టీజీవీ కళాక్షేత్రం సంకల్పించింది. ఆంధ్రరాష్ట్ర అవతరణ సందర్భంగా నవంబరు ఒకటో తేదీ నుంచి 7వ తేదీ వరకు వారం రోజుల పాటు టీజీవీ కళాక్షేత్రంలో ఆధ్వర్యంలో 'కర్నూలు ఉత్సవ్' నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. ఆదివారం కళాక్షేత్రంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో పలు వివరాలను వెల్లడించారు. మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్, పారిశ్రామికవేత్త టీజీ రెడ్డి, విద్యాసంస్థల అధినేతలు రవీంద్ర, జి.పుల్లయ్య, మాంటిస్సోరి రాజశేఖర్ సూచనల మేరకు సాంస్కృతిక, చారిత్రాత్మక, సాహిత్య, జానపద అంశాలను వెల్లడించే విధంగా ఈ ఉత్సవానికి కార్యాచరణ రూపొందించామన్నారు. గతంలో కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఇలాంటి వేడుకలు జరగలేదని, ఇదే ప్రథమమని తెలిపారు. ఇందుకోసం డీఐజీ, కలెక్టర్, ఎస్పీల సహకారం తీసుకుంటామన్నారు. కర్నూలు ఖ్యాతిని పెంచేలా ఉన్న ఈ ఉత్సవాల్లో అధికారులు, ప్రభుత్వం కూడా పాలుపంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో కళాక్షేత్రం కార్యదర్శి సి.యాగంటీశ్వరప్ప, ప్రతినిధులు పి.రాజారత్నం, మహమ్మద్ మియా, గాండ్ల లక్ష్మన్న, ఎన్‌వీ రమణ, లక్ష్మీకాంతరావు, ఈశ్వరయ్య, చంద్రకంటి మద్దయ్య, పీపీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'కర్నూలు ఉత్సవ్' ఇలా..

- టీజీవీ కళాక్షేత్రంలో నవంబరు 1న సాయంత్రం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి, అనంతరం నగరంలోని నృత్య గురువుల ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు.
- నవంబరు 2న ఉమ్మడి జిల్లా కళాకారులతో జానపద నృత్య సంగీత ప్రదర్శనలు.
- నవంబరు 3న ఉమ్మడి జిల్లాకు చెందిన కవులు, కవయిత్రులతో కవి సమ్మేళనం.
- నవంబరు 4న ఉమ్మడి జిల్లా సాహిత్యవేత్తలు, రచయితలతో సాహిత్య సభ,
- నవంబరు 5న 'ఆంధ్ర రాష్ట్ర అవతరణ-మొదటి రాజధాని కర్నూలు' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు.
- నవంబరు 6న అంతరించిపోతున్న తోలుబొమ్మలాట, బుర్రకథ, హరికథ ఇతర ప్రదర్శనలు
- నవంబరు 7న ఔత్సాహిక పౌరాణిక కళాకారులతో ఏకాంకిక నాటక ప్రదర్శనలు ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగుతాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని ప్రముఖుల ఛాయాచిత్ర ప్రదర్శన వారం రోజులు కళాక్షేత్రంలో కొనసాగుతుంది.

అమ్మను వదిలేసిన కొడుకులు

● రోడ్డు పాలైన వృద్ధ తల్లి

● అక్కున చేర్చుకున్న వృద్ధాశ్రమ నిర్వాహకులు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కని, పెంచిన పిల్లలే తల్లి వృద్ధురాలైందని రోడ్డున వదిలేశారు. మూడు రోజులుగా దిక్కులేకుండా ఆకలితో అలమటిస్తున్న ఆ వృద్ధురాలు చూసి పట్టణంలోని జీవనజ్యోతి ఆశ్రమానికి సమాచారం ఇచ్చారు. ఆశ్రమ నిర్వాహకుడు పాస్టర్ విక్టర్ పాల్ ఫిలిప్ (72) ఏళ్ల వృద్ధురాలని అక్కున చేర్చుకున్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన బేగారి లక్ష్మమ్మకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉందని ఆమె తెలిపిందని అన్నారు. ఆమెకు ఆరోగ్యం బాలేకపోతే రాయచూర్ నుంచి ఆదోనికి ఆసుపత్రిలో చూపిస్తామని కుమారులు తీసుకొచ్చారన్నారు. కుమారులు రంగా, రమేష్ బసప్ప మాటలు విని వృద్ధురాలు నరసమ్మ ఆదోనికి చేరుకుంది. ఎమ్మిగనూరు సర్కిల్ సమీపంలోని మెడికల్ షాప్ వద్ద ఆమెను కుమారులు వదిలేసి వెళ్లారు. మూడు రోజులుగా ఆకలితో అలమటిస్తున్న వృద్ధురాలిని మెడికల్ షాప్‌లో పనిచేసే వలి తమకు సమాచారం ఇచ్చారన్నారు. హిందీ ఉపాధ్యాయుడు నరసయ్య మానవత్వంతో భోజనం అందించారు. ఆశ్రమ నిర్వాహకుడు ఫిలిప్ అక్కున చేర్చుకుని ఆశ్రమానికి తీసుకెళ్లి మానవత్వం చాటుకున్నారు. ఆరోగ్యం బాగా లేకపోతే వైద్యునితో చికిత్స చేస్తున్నట్లు తెలిపారు.



వృద్ధురాలిని ఆశ్రమానికి తీసుకెళ్తున్న నిర్వాహకులు

గూడు చెదిరి.. తరువు కింద చేరి..!



చెట్టుకింద చెక్క పెట్టెలో నివాసం

తన అనుకున్న వారు ఉన్నా రెక్కల తెగిన పక్షిలాగా ఒంటరైంది.. గూడు చెదిరి.. తరువే(చెట్టు) ఆవాసమైంది. వర్షానికి తడుస్తూ.. ఎండకు ఎండుతూ.. చలికి వణుకుతూ.. భద్రత కరువై.. బతుకు బరువై దీనావస్థలో 15ఏళ్లుగా కొట్టుమిట్టాడుతోంది మంత్రాలయానికి చెందిన పద్మమ్మ. పెద్దలింటి భీమయ్య, నరసమ్మ దంపతులకు ఏడుగురు సంతానం. ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు. వీరిలో పద్మమ్మను కర్ణాటకలోని రాయచూరు జిల్లా వీరాపురం ఇచ్చి పెళ్లి చేశారు. అక్కడి పరిస్థితి బాగా లేకపోవడంతో పద్మమ్మ, భర్త నాగేంద్రప్ప కొన్నేళ్ల క్రితం మంత్రాలయం వచ్చేశారు. వీరికి సంతానం లేదు. అనారోగ్యంతో భర్త నాగేంద్రప్ప మృతిచెందాడు. ఆమె ఒంటరి దైంది. అక్క, అన్న, తమ్ముళ్లు, చెల్లెలున్నా వారి ఇంటికి వెళ్లేందుకు ఆమె మనసు ఒప్పడం లేదు. చెట్టు కిందే ఓ బల్ల చెక్కతో గూడు ఏర్పాటుచేసుకుంది. కూటమి ప్రభుత్వం ఇచ్చే రూ.4వేలు పింఛన్, 5కేజీల బియ్యం, మూడిళ్లలో పనులు చేస్తూ నెలకు వచ్చే రూ.1,500తో నెట్టుకొస్తుంది. 1998లో పురపాలక శాఖ మంత్రి టీజీ మోహన్‌రెడ్డి ఆమెకు రాఘవేంద్రపురంలో రెండు సెంట్ల స్థలమిచ్చారు. అక్కడ పూరి గుడిసె ఏర్పాటు చేసుకొని నివాసముండేది. గుడిసె కూడా కూలిపోయింది. కర్ణాటక గెస్టు హౌస్ మైదానంలో ప్రహరీవద్ద ఉన్న చెట్టు కిందే ఒక మూలన బల్ల ఏర్పాటుచేసుకొని జీవిస్తోంది. చిన్న వయసులో భర్తను కోల్పోయి కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లలేక చెట్టుకిందే కాపురముంటూ అనాథగా జీవిస్తుంది. పాలకులు, అధికారులు స్పందించి తనకు ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆమె కన్నీటి పర్యంతమవుతుంది.

● మంత్రాలయం, ఆంధ్రజ్యోతి



అంట్లు తోముకుంటున్న బారికి పద్మమ్మ

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఘనంగా పల్లకీ ఉత్సవం



స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పూజ చేస్తున్న అర్చకులు

శ్రీశైలం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసం దేవస్థానం ఆదివారం రాత్రి శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబికా దేవి ఉత్సవమూర్తులకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

వ్యవసాయ కార్మికుల వేతనాలు పెంచాలి

- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఆత్మకూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయ కార్మికుల వేతనాలను పెంచాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వ్యవసాయ కార్మికుల రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని అన్నారు. అలాగే అర్హులైన పేదలందరికీ ఐదు సెంట్ల స్థలాన్ని ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలన్నారు. 15 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయడంతో పాటు ఉపాధి హామీ చట్టం ద్వారా కుటుంబానికి 200 రోజులు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు బాలయ్య, డేవిడ్, కర్ల, రమణ, సుబ్బరాయుడు,రత్నమయ్య తదితరులున్నారు.

మా ఊరికి బస్సు వచ్చిందోచ్..!



సింగరాజుపల్లెలో బస్సుకు పూజ చేస్తున్న గ్రామస్థులు

కొత్తపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాజుపల్లెకు ఆత్మకూరు ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా బస్సు సౌకర్యాన్ని కల్పించారు. దీంతో ఆదివారం గ్రామానికి బస్సు రావడంతో గ్రామస్థులు స్వాగతం పలికారు. అలాగే మహిళలు మామిడి తోరణాలు, పూలమాలలు వేసి పూజలు చేశారు. కొన్నేళ్లుగా గ్రామానికి బస్సు సౌకర్యం రాకపోవడంతో గ్రామ శివారులోని కిలోమీటరు దూరంలో ఉన్న అడ్డరోడ్డు సెంటర్ వరకు గ్రామస్థులు నడుచుకుంటూ వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎట్టకేలకు గ్రామస్థుల వినతి మేరకు ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించారు. ప్రతి రోజు ఉదయం ఆత్మకూరు నుంచి 8.45 గంటలకు బయలుదేరి సింగరాజుపల్లెకు 9.30 గంటలకు చేరుకుంటుంది. అలాగే సాయంత్రం ఆత్మకూరులో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి 3.45 గంటలకు సింగరాజుపల్లెకు చేరుకుంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. గ్రామానికి బస్సు రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా.. వ్యక్తికి గాయాలు

మహానంది, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి కిందపడటంతో వ్యక్తికి గాయాలు అయ్యాయి. విశ్రాంతి ఉద్యోగి బీకే స్వామిరెడ్డి ఆదివారం మోటారు బైక్‌పై నంద్యాలకు వెళ్లాడు. తిరిగి మహానంది వస్తుండగా మార్గమధ్యలోని అల్లీనగరంలోని ప్రధాన రహదారిలో కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడ్డ స్వామిరెడ్డిని స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు.

కంకర తేలిన రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని పాలకులు



పాములపాడు, చెలిమిళ్ల రహదారి దుస్థితి

పాములపాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్ని గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారాయి. దాంతో వాహనదారులు, రైతులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కానీ, అటు అధికారులు ఇటు పాలకులు గానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మండలంలోని పాములపాడు నుంచి చెలిమిళ్ల, లింగాల వెళ్లే రహదారి దెబ్బతినింది. నేషనల్ హైవే పనుల్లో భాగంగా ఈ రహదారి గుండా భారీ వాహనాలు తిరుగుతుండటంతో రోడ్డు గుంతలమయంగా మారింది. దాంతో చిన్నవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొలనుభారతి, సంగమేశ్వరానికి కర్నూలు నుంచి వచ్చే భక్తులు పాములపాడు నుంచి ఈ రహదారి గుండా వెళ్లాల్సి ఉంది. అలాగే పొలాలకు వెళ్లే రైతులు, కొత్తపల్లి మండలానికి వెళ్లే వాహనదారులు, ఉద్యోగులకు ప్రయాణం నరక ప్రాయంగా మారింది. అలాగే ఎర్రగూడూరు నుంచి శాంతినిలయం, కంబాలపల్లి నుంచి ఇస్కాల, మిట్టకందాల నుంచి మద్దూరు, బుద్ధానగర్, క్రిష్ణరావుపేట నుంచి మిట్టకందాల గ్రామాల రహదారులు దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామీణ రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, లేదా నూతన రోడ్లను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

- మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టెక్కె వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఈ సంత కామధేను సిరిసంపద, నవ నందుల నంద్యాల చెంత గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోఆధారిత ప్రకృతి ఉత్పత్తులైన దేశవాళీ వంగడాలు, కాయగూరలు, చిరుధాన్యాలు, ఆయుర్వేద ఉత్పత్తుల ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన ధాన్యాన్ని తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. గోఆధారిత వ్యవసాయం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. పర్యావరణ సమతుల్యాలను కాపాడుతుందన్నారు. నంద్యాల జిల్లా రైతులు ప్రకృతి సాగులో ముందుండాలని ఆకాక్షించారు. అనంతరం మార్కెట్‌యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంలో పూర్తిగా సహకరిస్తామన్నారు. ఈసంత ద్వారా ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అమ్ముకునేలా అవకాశం లభించిందన్నారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయ నిపుణులు విజయరాం, మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ రంగప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త పబ్బతి వేణు, వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్



మాట్లాడుతున్న హరిబాబు

డిజిటల్ అగ్రి మిషన్‌తో పేదల భూములకు ముప్పు

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): డిజిటల్ అగ్రి మిషన్ పేరుతో ప్రభుత్వ, పేదల భూములను బహుళజాతి కంపెనీలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకరరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఆ సంఘం జిల్లా రెండవ మహాసభలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రైతులు పండించిన దిగుబడులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని అన్నారు. కార్పొరేట్ శక్తుల అప్పులను మాఫీ చేస్తున్న ప్రభుత్వాలు రైతుల అప్పులను మాత్రం మాఫీ చేయడం లేదని ఆరోపించారు. డిజిటల్ మిషన్ పేరుతో పెద్ద వ్యవసాయ క్షేత్రాలను ప్రైవేట్ కంపెనీలకు అందించడం వల్ల చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయానికి దూరమయ్యే ప్రమాదం ఉందని అన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం రైతులందరు ఏకం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు తీర్మానాలకు ఆమోదం తెలిపారు. సమావేశంలో ఆయా సంఘాల జిల్లా నాయకులు రమేష్‌కుమార్, రాజశేఖర్, డాక్టర్ నాగన్న, రామకృష్ణ, ఏసురత్నం తదితరులున్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి



శిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యుడు

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరురూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సింగిల్ విండో చైర్మన్ షాబుద్దీన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలుకు చెందిన శ్రీ చక్ర హాస్పిటల్ చైర్మన్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు దాదాపు 200 మందికి గుండెకు సంబంధించిన ఈసీజీ, 2డీ ఎకో, కంటి, ఎముకల వ్యాధులకు సంబంధించిన చికిత్స నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుండె వ్యాధి వైద్యులు ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రతి ఆరు నెలలకు ఒకసారి గుండె పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచించారు. కార్యక్రమంలో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు నూర్, ఫసివిల్ మున్నా, టీడీపీ నాయకులు ఖాజా మొహిద్దీన్, ఆసీఫ్ బేగ్, తైక్వాండో గౌరవ అధ్యక్షుడు నాయబ్ , వైద్యులు మహాలక్ష్మి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ శ్రీశైలం పర్యటనకు

కూటమి శ్రేణులు సన్నద్ధం

- 15న జనాల తరలింపు
- 16న పీఎంకు వినూత్నంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు

ఆత్మకూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 16న శ్రీశైలానికి రానున్న నేపథ్యంలో ఆయన పర్యటనను జయప్రదం చేసేందుకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి నేతృత్వంలో కూటమి పార్టీల శ్రేణులు సన్నద్ధమవుతున్నారు. పటిష్ట బందోబస్తు నడుమ జరగనున్న ప్రధాని పర్యటనను పురస్కరించుకుని ఈ నెల 15న ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల నుంచి శ్రీశైలానికి భారీగా జనం తరలివెళ్లేందుకు కూటమి పార్టీల శ్రేణులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆయా గ్రామాలు, వార్డులకు జనసమీకరణ చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించారు. అయితే ప్రధానికి వినూత్నంగా స్వాగతం పలికేందుకు గానూ.. మహిళలు కాషాయం రంగు చీర, ఎరుపు రంగు బ్లౌజ్, పురుషులు తెలుపు రంగు దుస్తువుల్లో హాజరవ్వాలని సూచించారు. 15వ తేది మధ్యాహ్నం నుంచే శ్రీశైలానికి వెళ్లి అదేరోజు వారికి స్వామి అమ్మవార్ల దర్శనంతో పాటు వసతి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. 16న మోదీ పర్యటన అనంతరం మధ్యాహ్న భోజనం పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణం అయ్యేలా ప్రణాళిక రూపొందించారు. కాగా భారీ భద్రతా నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటనకు వచ్చే వ్యక్తుల వివరాలను ఇప్పటి నుంచే సేకరిస్తున్నారు. శ్రీశైలానికి వచ్చే ప్రతి వ్యక్తి గ్రామం, ఆధార్, ఫోన్ నంబర్ సేకరిస్తున్నారు. మొత్తానికి పర్యటనను విజయవంతం చేసేందుకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.



శ్రీశైలం దేవస్థానం

జ్యూవెలరీ ఎగ్జిబిషన్ పరిశీలన



ఆభరణాలను పరిశీలిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అన్సర్ డైమండ్ గోల్డ్ జ్యూవెలరీ ఎగ్జిబిషన్‌ను ఆదివారం మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ మోడల్స్ ఆభరణాలను తిలకించారు. మంత్రి మాట్లాడుతూ నంద్యాలలో అన్సర్ డైమండ్ గోల్డ్ జ్యూవెలరీ ఆధ్వర్యంలో ప్రజలకు అందుబాటులో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చాలా ఏళ్లనుంచి ప్రజలకు పలు రకాల డిజన్లతో ఆభరణాలను అందిస్తూ ప్రజల మన్నలను పొందిందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మంత్రి వెంట అన్సర్ జ్యూవెలరీ అధినేతలు అన్సర్, అమీర్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

సైబర్ మోసాలతో జాగ్రత్త: సీఐ

ఆత్మకూరురూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోరాదని ఆత్మకూరు సీఐ రాము సూచించారు. ఆదివారం రాత్రి కురుకుంద గ్రామంలో గ్రామ సభ నిర్వహించి ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామాలలో ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ప్రశాంత జీవనం గడపాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల పిల్లలకు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని సూచించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తాగి వాహనాలు నడపరాదన్నారు. పిల్లలను బావుల వద్దకు, చెరువుల వద్దకు పంపవద్దని సూచించారు. ఆడపిల్లల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కురుకుందలో అవగాహన కల్పిస్తున్న సీఐ రాము

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కొక్కెరంచలోని బాధితకుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కొత్తపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి కుటుంబానికి తోటి మిత్రులు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. 1990-91లో ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొక్కెరంచ గ్రామానికి చెందిన వెంకటయ్య పదవ తరగతి చదివాడు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పూర్వ స్నేహితులు ఆదివారం గ్రామానికి వెళ్లి బాధితకుటుంబాన్ని పరామర్శించారు. రూ. రూ.1.10,000 ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు స్నేహితులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు పెరిగాయి

- మాలమహానాడు నాయకుడు డాక్టర్ వెంకటేష్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

నందికొట్కూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అత్యున్నత స్థానాల్లో ఉన్న ఎస్సీఎస్టీ, బీసీలపై దాడులు, వేధింపులు పెరిగి ప్రపంచంలోనే భారత్ వెలిగిపోతోందని మాల మహానాడు నాయకుడు డాక్టర్ డి.వెంకటేష్ విమర్శించారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద తాలుకా మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై జరిగిన దాడి అమానుషమన్నారు. జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై జరిగిన దాడి ఘటన మరువకముందే హర్యానా రాష్ట్రంలో దళిత ఐపీఎస్ అధికారి పురన్‌కుమార్ ఉన్నతాధి కారుల వేధింపులు, కుల వివక్షతకు గురై ఆత్మహత్య చేసుకోవడం విచారకరమన్నారు. ఎస్సీఎస్టీ, బీసీలను వేధిస్తున్న వారిని దేశ బహిష్కరణ చేయాలని, లేనిపక్షంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. మాల మహానాడు నాయకులు మధు, శ్రీను, నాగేంద్ర, ధర్మరాజు పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి పచ్చళ్లు విరాళం



అధికారులకు అందజేసిన పచ్చళ్లు

శ్రీశైలం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన సత్రానికి ఓ భక్తుడు పచ్చళ్లను విరాళంగా అందించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్‌గౌడ్ అనే భక్తుడు ఆదివారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం 1000 కేజీల మామిడి, నిమ్మకాయ రెండు రకాల పచ్చళ్లను విరాళంగా అధికారుల సమక్షంలో అందజేశారు. వీటి విలువ సుమారు రూ.లక్షకు పైగా ఉన్నట్లు తెలిపారు. దాత ఇచ్చిన పచ్చళ్లను అన్నదానంలో భక్తులకు వినియోగించనున్నారు.

బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా తిరుపాల్ నాయక్



తిరుపాల్ నాయక్‌ను అభినందిస్తున్న బంజారా నాయకులు

పాణ్యం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా సుగాలిమెట్ట గ్రామానికి చెందిన డి.తిరుపాల్‌నాయక్ ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లా సంఘం అధ్యక్షుడిగా తిరుపాల్‌నాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక బంజారా నాయకులు అభినందనలు తెలిపారు.

నేడు బీజేపీ జిల్లా స్థాయి సమావేశం

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లాస్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ జిల్లాకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు కూటమి నాయకులతో జిల్లాస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం బీజేపీ జిల్లా కార్యాలయంలో ప్రధానిని ఎవరెవరు కలువాలో అన్న అంశంపై చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని బీజేపీ జాతీయ, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

నేడు మహానందిలో హుండీ లెక్కింపు

మహానంది, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. ప్రధాన ఆలయాల్లోని హుండీలతో పాటు అన్నదానం, గోసంరక్షణ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం అభిషేకమంటపంలో సిబ్బంది, వివిధ సేవా సంస్థల సభ్యులు లెక్కింపులో పాల్గొంటారని ఈవో చెప్పారు. వచ్చిన ఆదాయాన్ని స్థానిక బ్యాంక్ ఖాతాలో డిపాజిట్ చేయనున్నట్లు ఈవో పేర్కొన్నారు.

రేపు ఆంజనేయస్వామి ఆలయంలో..

నంద్యాల కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్నట్లు ఈవో వేణునాథరెడ్డి ఆదివారం తెలిపారు. దేవదాయశాఖ ఉన్నతాధికార్ల పర్యవేక్షణలో లెక్కిస్తామన్నారు. ఆసక్తి గల భక్తులు తమ పేర్లను ఈవో కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న జయరాజు

పాములపాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఇస్కాల గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆత్మకూరు మండలం పెద్ద అనంతపురం గ్రామానికి చెందిన జయరాజు(40), ఇస్కాల గ్రామానికి చెందిన లక్ష్మీదేవిని వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. మూడు రోజుల క్రితం భార్యాభర్త గొడవపడ్డారు. దాంతో ఆమె తన పుట్టినింటికి వెళ్లింది. కాగా, భార్యను ఇంటికి తీసుకెళ్లేందుకు ఇస్కాల గ్రామానికి జయరాజు వెళ్లగా ఇద్దరి మధ్య మళ్లీ గొడవ పడ్డారు. ఆమె కాపురానికి రానని, వ్యవసాయ కూలీ పనుల నిమిత్తం తెలంగాణ రాష్ట్రానికి వెళ్లింది. మనస్తాపానికి గురైన జయ రాజు ఆదివారం ఉదయం ఇస్కాల గ్రామంలోని ఓ పూరి గుడిసెలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. తల్లి దీవెనమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ప్రధాని మోదీ సభను జయప్రదం చేయాలి

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

ప్యాపిలి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న కర్నూలులో నిర్వహించే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభను జయప్రదం చేయాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంతి భవనంలో నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ కర్నూలు పర్యటనకు రావడం హర్షణీయమన్నారు. ఆయనతో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హాజరవుతున్నట్లు తెలిపారు. మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం కోట్ల పట్టణంలో శిథిలావస్థకు చేరుకున్న చెన్నకేశవస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ అభివృద్ధి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో డీసీఎంఎస్ చైర్మేన్ నాగేశ్వరరావుయాదవ్, నియోజవకవర్గ పరిశీలకులు హరి, ప్రభాకర్‌రెడ్డి, వై లక్ష్మీనారాయణయాదవ్, టి శ్రీనివాసులు, ఖాజా పీర్, రామ్మోహన్‌యాదవ్, మధు, రమేష్‌రెడ్డి, చల్లా వీర, నాగేంద్ర, అలేబాదు పరమేష్, ఆర్‌ఈ నాగరాజు, కలచట్ల ప్రసాద్, రమణగౌడు, నబీరసూల్, శ్రీరాములు, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

విభజన హామీలపై మోదీ స్పందించాలి: సీపీఐ



మాట్లాడుతున్న రంగనాయుడు

కొలిమిగుండ్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సందర్భంగా రాయలసీమకు ఇచ్చిన హామీలపై ప్రధాని నరేంద్రమోదీ స్పందించాలని నంద్యాల జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. శనివారం కొలిమిగుండ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విభజన సమయంలో రాయలసీమకు చెప్పిన ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, కడప ఉక్కు పరిశ్రమకు కేంద్రం నిధులివ్వాలని కోరారు. టమోటా, ఉల్లి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వం తరఫున ప్రధాని ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా సమస్యలపై స్పష్టమైన ప్రకటన ఇవ్వకుంటే ప్రధాని పర్యటనపై నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు సంజీవులు, మహేష్ పాల్గొన్నారు.

రాయలసీమకు ప్రధాని చేసిందేమీ లేదు: సీపీఎం



మాట్లాడుతున్న నక్కి శ్రీకాంత్

డోన్ రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాయలసీమకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిందేమీ లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ ఆరోపించారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీలను అమలు చేయకుండా ఈ నెల 16వ తేదీన ఉమ్మడి జిల్లాకు వస్తున్న మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ మండల కేంద్రాల్లో 14 వ తేదీన నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమా వేశంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు చిన్న రెహిమాన్, శివరాం, నాగమద్దయ్య, అశోక్, షమీమ్ బేగం పాల్గొన్నారు.

హిందూ సమాజ నిర్మాణమే లక్ష్యం



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడు సుధాకర్‌రావు

ఉయ్యాలవాడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): హిందూ సమాజ నిర్మా ణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని ఆళ్లగడ్డ ఖండ విభాగ్ కుటుంబ సంయోజక్ సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం ఉయ్యాలవాడ గ్రామంలోని రామాలయంలో ఆయా గ్రామాల కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని పాటించాలన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా లబినవ శంకరానందస్వామి హాజరయ్యారు. కార్యక్రమంలో మోహనకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి

చాగలమర్రి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని ఆ యూనియన్ మండల అధ్యక్షురాలు శివలక్ష్మి, కార్యదర్శి పెద్దక్క ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్నా నేటికి పెంచలేదని అన్నారు. ఆశా వర్కర్లకు అన్ని రకాల వారాంతపు, క్యాజువల్, మెడికల్ సెలవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కల్తీ మద్యంపై నిరసన ర్యాలీ

డోన్ రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న కల్తీ మద్యంపై సోమవారం వైసీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు డోన్ వైసీపీ వర్గాలు తెలిపాయి. మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ ఉంటుందని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయా లని కోరారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

డోన్ రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామంలో రేషన్ కార్డుదారులకు ఆదివారం నూతన స్మార్ట్ రేషన్ కార్డులను టీడీపీ నాయకుడు పవన్ కుమార్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెద్దయ్య, చిన్న సోమన్న, యాగంటి బాల పెద్దయ్య పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

శిరివెళ్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : శిరివెళ్ల గ్రామానికి చెందిన బిజ్జం వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తి కనిపించకపోవడంతో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్నపీరయ్య ఆదివారం తెలిపారు. వెంకటేశ్వరరెడ్డి రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో, బంధువుల ఇళ్ల వద్ద విచారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెల్లడించారు.

ఎర్రబారిన పసుపు

- 200 ఎకరాల్లో పంటకు సోకిన తెగుళ్లు
- ఆందోళనలో రైతన్నలు

చాగలమర్రి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పసుపు పంటకు కాడ తెగుళ్లు సోకి పంటంతా ఎర్రబారి పోతోంది. దీంతో పంట దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్ని మందులు పిచికారి చేసిన లాభం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చిన్నవంగలి, చింతలచెరువు, పెద్దవంగలి, చాగలమర్రి, డి.వనిపెంట, ముత్యాలపాడు తదితర గ్రామాల్లో 500 ఎకరాల్లో పసుపు పంటను రైతులు సాగు చేశారు. సుమారు 200 ఎకరాలకు పైగా కాడ తెగుళ్లు సోకి పసుపు ఆకులు ఎర్రగా మారుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్క చిన్నవంగలి గ్రామంలోనే 150 ఎకరాల దాక పసుపు పంటను సాగు చేశారు. ఇప్పటి వరకు ఎకరాకు రూ.50 వేలు వరకు పెట్టుబడులు పెట్టారు. అధిక వర్షాలు, వాతావరణ ప్రభావంతో పంటకు తెగుళ్లు సోకి దెబ్బతిన్నాయని రైతులు విలపిస్తున్నారు. అధికారులు స్పందించి కాడతెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు అందించాలని రైతులు కోరుతున్నారు.



చిన్నవంగలిలో తెగుళ్లతో దెబ్బతిన్న పసుపు పంట

తెగుళ్లతో నష్టపోతున్నాం



పసుపు పంటకు కాడ తెగుళ్లు సోకి ఎర్రబారి నష్టపోతున్నాం. అధిక దిగుబడి సాధించవచ్చని ఆశించి 10 ఎకరాల్లో పసుపు పంట సాగు చేస్తే తెగుళ్లు సోకి ఎర్రబారి పోతోంది. ఎన్ని మందులు వాడిన తెగుళ్లు తగ్గడం లేదు. తెగుళ్ల బారీ నుంచి పంటను కాపాడాలి.

● గురునాథ్‌రెడ్డి, రైతు, చిన్నవంగలి

ప్రభుత్వం ఆదుకోవాలి



6 ఎకరాల్లో పసుపు పంట సాగు చేశా. తెగుళ్లు సోకి పసుపు పంటంతా ఎర్రబారి దెబ్బతింది. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టా. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఎన్ని మందులు వాడిన తెగుళ్లు తగ్గడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

● నాగేశ్వర్‌రెడ్డి, కౌలు రైతు, చాగలమర్రి

టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ల నియామకం



టీఈ రాఘవేంద్రగౌడు | దశరథ రామిరెడ్డి | మెట్టుపల్లి సుదర్శన్ | ఎల్ల నాగయ్య | కొంగనపల్లి మధు | బుగ్గన ప్రసన్నలక్ష్మి

డోన్ టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సూచన మేరకు డోన్ నియోజకవర్గం లో మూడు మండలాలు, మూడు పట్టణాలకు పార్టీ కన్వీనర్లను నియ మించింది. డోన్ మండల పార్టీ కన్వీనర్‌గా దశరథరామిరెడ్డి, బేతంచెర్ల మండల కన్వీనర్‌గా ఎల్ల నాగయ్య, ప్యాపిలీ మండల కన్వీనర్‌గా మెట్టుపల్లి సుదర్శన్‌లు ఎంపికయ్యారు. అలాగే డోన్ పట్టణ కన్వీనర్‌గా టీఈ రాఘవేంద్రగౌడు, బేతంచెర్ల పట్టణ కన్వీనర్‌గా బుగ్గన ప్రసన్నలక్ష్మి, ప్యాపిలి పట్టణ కన్వీనర్‌గా కొంగనపల్లి మధులు ఎంపికయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల ప్రకారం వారు వారి పరిధిలో పార్టీ బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

నేడు కూటమి నాయకుల సమావేశం

డోన్ టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఉమ్మడి జిల్లా పర్యటన సందర్భంగా సోమవారం పట్టణంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హాజరవుతారని తెలిపారు.

అహోబిలంలో ముగిసిన పవిత్రోత్సవం

ఆళ్లగడ్డ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజున ఆలయ ప్రధాన అర్చకులు కీబాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు లక్ష్మీనరసింహస్వామి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను హోమ మండపంలో కొలువు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. తమిళనాడు నుంచి వచ్చిన ప్రత్యేక అర్చక బృందం తిరుమంజనం, కుంభ ప్రోక్షణం, స్వామి అమ్మవార్లకు మహాపూర్ణాహుతి చేశారు. అనంతరం ప్రహ్లాద వరద స్వామికి అమ్మవార్లకు మంగళహారతి అందించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకిపై కొలువు దీర్చి తిరు వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

ఆదర్శప్రాయురాలు నారా భువనేశ్వరి: మంత్రి బీసీ

బనగానపల్లె, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నేటి తరానికి సీఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఆదర్శప్రాయురాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మంత్రి క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ నారా భువ నేశ్వరికి ఇన్స్టిట్యూట్ ఆఫ్ డైరక్టర్స్ 2025 సంవత్సరానికి అందించే డిస్టింగ్విష్ ఫెలోషిప్‌కు ఎంపిక కావడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సేవ, సామాజిక రంగాల్లో నారా భువనేశ్వరి అందిస్తున్న సేవలను గుర్తించి అరుదైన గౌరవం లభించడం అభినంద నీయమ న్నారు. ఒక పరిపూర్ణ మహిళగా కుటుంబ బాధ్యతలతోపాటు తను ఎంచుకున్న రంగంలో ముందుకు సాగుతున్న తీరు నేటి తరానికి ఆదర్శమన్నారు.

పెండేకంటి వెంకటసుబ్బయ్య వర్ధంతి



పెండేకంటి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న టంగుటూరు శ్రీనయ్య తదితరులు

బనగానపల్లె, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బనగానపల్లెలో కేంద్ర మాజీ మంత్రి, మాజీ గవర్నర్ పెండేకంటి వెంకటసుబ్బయ్య 33వ జయంతిని ఆదివారం నిర్వహించారు. టీడీపీ నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య పెండేకంటి విగ్ర హానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి దేశస్థాయిలో సేవలందించిన వ్యక్తి పెండేకంటి అని కొనయాడారు. బీహార్, కర్ణాటక రాష్ట్రాలకు గవర్నర్‌గా, మాజీ కేంద్ర మంత్రిగా సేవలందించారన్నారు. బనగానపల్లె -ఎర్రగుంట్ల రైల్వేలైన్, బనగానపల్లెలో ఆర్టీసీ బస్టాండ్ పెండేకంటి వల్లనే సాధ్యమైందన్నారు. యాగంటిపల్లె సమీపంలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో చెర్వుపల్లె శరత్, ఇటిక్యాల సాయిరాం, సురేష్, ఉపాధ్యా యులు నాగరాజు, పెండేకంటి వెంకటసుబ్బయ్య, సాయిరాం, జగంశెట్టి పాల్గొన్నారు.

27 వరకు గడువు

బేతంచెర్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ అడ్మిషన్ల తుది గడువు ఈనెల 27వ తేదీ వరకు రూ.200 అపరాధ రుసుంతో పొడిగించినట్లు భాగ్యోదయ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ కానాల నాగలక్ష్మిదేవి ఆదివారం తెలిపారు. కేవలం ఆరు నెలల్లో పది, ఇంటర్ కోర్సులు పూర్తి చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ పదోన్నతి కోసం రెగ్యులర్ చదువు మధ్యలో మానేసిన వారు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి శని, ఆదివారం పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తామన్నారు.

రేషన్ బియ్యం ఏమైనట్లు?

రుద్రవరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకొండ గ్రామంలో చౌక దుకాణంలో ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం తక్కువ వచ్చాయి. డీలరు నుంచి వీఆర్వో గురుస్వామికి బియ్యం బాధ్యత రెవెన్యూ అధికారులు అప్పగించారు. రేషన్ బియ్యాన్ని రైతు భరోసా కేంద్రానికి తరలించారు. అక్కడ డీలర్ ఇంటి నుంచి రైతు భరోసా కేంద్రానికి బియ్యం జొన్నలు, చక్కెర రెవెన్యూ అధికారులు తరలించారు. రైతు భరోసా కేంద్రంలో కార్డుదారులకు వీఆర్వో రేషన్ పంపిణీ చేశారు. బియ్యం ఐదు కింటాళ్ల తరుగుపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నా రని, ఈ రేషన్ దుకాణం పరిధిలో 700 కార్డులు ఉన్నాయని వీఆర్వో తెలిపారు.

560 క్వింటాళ్ల శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్

కొలిమిగుండ్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఇప్పటివరకు 560 క్వింటాళ్లు శనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగేంద్రప్రసాదు ఆదివారం తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన 620 మంది రైతులు ఆన్‌లైన్ ద్వారా శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారని అన్నారు. ఒకటి, రెండ్రోజుల్లో రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేస్తామని ఏవో తెలిపారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

కొలిమిగుండ్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని ఆ శాఖ ఏఈ లక్ష్మణస్వామి ఆదివారం వినియోగదారులకు సూచించారు. విద్యుత్ బిల్లులు ఆలస్యంగా చెల్లించడం వలన వినియో గదారులకు అపరాధ రుసుం పడుతుందన్నారు. మండలంలో పరిశ్ర మలకు సంబంధించి 450 సర్వీసులు, 11వేల గృహ సర్వీసులు, 2200 అగ్రికల్చర్ సర్వీసులు ఉన్నాయన్నారు.

నేడు విధుల్లో నూతన ఉపాధ్యాయులు

అవుకు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరనున్నట్లు ఎంఈవో శ్రీధర్‌రావు ఆదివారం తెలిపారు. ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి శిక్షణ పూర్తి కావటంతో ప్రభుత్వం మండలంలో ఖాళీగా ఉన్న పాఠశాలలకు 53 మంది ఉపాధ్యాయులను నియమించిందని అన్నారు. ఇందులో 20 మంది స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)లు కాగా 33 మంది సెకండ్‌గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)లు కేటాయించిన స్థానాల్లో ఉపాధ్యాయులుగా విధుల్లో చేరనున్నట్లు తెలిపారు.

ఇక డోన్‌పై పటిష్ట నిఘా

- సీసీ కెమెరాల ఏర్పాటు
- పర్యవేక్షణకు ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూం

డోన్ రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు, ప్రమాదాల నివారణకు డోన్‌పై పటిష్ఠమైన నిఘా వ్యవస్థను డోన్ పోలీసులు బలోపేతం చేస్తున్నారు. డోన్ డీఎస్పీ పి.శ్రీనివాసులు చొరవతో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐలు, సిబ్బంది సీసీ కెమెరాల ఏర్పాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతాల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని పాతబస్టాండు, కంబలపాడు సర్కిల్, బేతంచెర్ల సర్కిల్‌తో పాటు డోన్ పట్టణ సమీపంలో జాతీయ రహదారి సర్కిల్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో డోన్ పట్టణం మొత్తం 120 సీసీ కెమెరాల ఏర్పాటుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. సీసీ కెమెరాలను అనుసంధానం చేస్తూ డోన్ డీఎస్పీ కార్యాలయం ఒక గదిలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల అనుసంధానం చేసి కమాండో కంట్రోల్ రూమ్ నుంచే డోన్ పరిసర ప్రాంతాలను పర్యవేక్షించే విదంగా నిఘా వ్యవస్థను పటిష్టం చేస్తున్నారు. త్వరలోనే సీసీ కెమెరాల ఏర్పాట్ల లక్ష్యాన్ని పూర్తి చేసుకుని వాటికి అనుసంధానంగా పని చేసే కమాండ్ కంట్రోల్ రూమ్‌ను అధికారికంగా ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.



పాతబస్టాండులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్

పటిష్టమైన నిఘా ఉంటుంది



డోన్ పట్టణంపై పటిష్ఠమైన నిఘా వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా దాతల సహకారం తీసుకుని పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటికి అనుసంధానంగా కమాండ్ కంట్రోల్ రూమ్ పని చేసేలా సన్నాహాలు చేస్తున్నాం.

● డీఎస్పీ శ్రీనివాసులు

ప్రజా సమస్యలను పరిష్కరించండి



మంత్రి బీసీకి సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

బనగానపల్లె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మంత్రి అర్జీలను స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు.

పేర్నినాని రౌడీ రాజకీయాలు మానుకోవాలి

డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్



మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

ప్యాపిలి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్నినాని రౌడీ రాజకీయాలు మానుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ హితవు పలికారు. ఆదివారం ఆయన స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ పేర్నినాని బీసీకి చెందిన సీఐపై దౌర్జన్యం చేయడం హేయమైన చర్య అని అన్నారు. ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పిన వైసీపీ నేతలకు దౌర్జన్యాలు చేయడం తగ్గలేదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు హరి, రామ్మోహన్‌యాదవ్ పాల్గొన్నారు.

శెట్టివీడులో వీధి దీపాల ఏర్పాటు

చాగలమర్రి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు గ్రామంలో ఆదివారం వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ తెలిపారు. రూ.34వేలు పంచాయతీ నిధులతో గ్రామంలోని పలు కాలనీల్లో 28 ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వీధి దీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

డోన్ రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటా పురం గ్రామంలో రేషన్ కార్డుదారులకు ఆదివారం నూతన స్మార్ట్ రేషన్ కార్డులను టీడీపీ నాయకుడు పవన్ కుమార్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెద్దయ్య, చిన్న సోమన్న, యాగంటి బాల పెద్దయ్య పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమతంగా ఉండాలి

ప్యాపిలి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వ్యాధులతో అప్రమతంగా ఉండాలని కర్నూలు మౌర్య హాస్పిటల్ డైరెక్టర్ వసీం అన్నారు. ఆదివారం మండలంలోని జలదుర్గం గ్రామంలో మౌర్య హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో దాదాపు 250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డైరెక్టర్ వసీం మాట్లాడుతూ ప్రస్తుతం బీపీ, షుగర్ వంటి రోగా లు పెరుగుతున్న నేపాథ్యంలో జీవనశైలీలో మార్పులు రావాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సౌజన్య, రవి, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి పూజలు

చాగలమర్రి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురా ళ్లపల్లె, శెట్టివీడు గ్రామాల రహదారిలోగల అభయాంజనేయ స్వామికి వేద పండితులు విశేష పూజలు చేశారు. తరలివచ్చిన భక్తులు ఆంజనే యస్వామికి తమలపాకులతో పూజలు చేశారు.

వైభవంగా ప్రవిత్రోత్సవం: చాగలమర్రిలోని గంగాభవాని, చౌడేశ్వరిదేవి, చాగలమ్మ ఆలయాల్లో ఆదివారం పవిత్రోత్సవాన్ని నిర్వహించారు. మహి ళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు.

మధ్యంతర భృతిని ప్రకటించాలి: ఎస్టీయూ



మాట్లాడుతున్న శివశంకర్

చాగలమర్రి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మధ్యంతర భృతి, 30 శాతం ఐఆర్ తక్షణమే ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా పెండింగ్ డీఏలు చెల్లించక పోవడం, పీఆర్సీ కమిటీ నియమించక పోవడం దారుణమన్నారు. యాప్‌ల భారంతో ఉపాధ్యాయులు బోధన చేయలేని పరిస్థితి నెలకొందని అన్నారు. యాప్‌ల భారం తగ్గిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం రోజుకు కొత్త ప్రోగ్రామ్ తీసుకొస్తూ ఉపాధ్యాయులపై పని ఒత్తిడి చేస్తుందని విమర్శించారు. సమావేశంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు మస్తాన్‌బాషా, నాయకులు మహబూబ్‌బాషా, రాజశేఖర్‌రెడ్డి, నారాయణ రెడ్డి, సుబ్బారావు, మాబుహుసేన్, గురుచంద్రుడు పాల్గొన్నారు.

డోన్ రూరల్: పెన్షనర్లకు మధ్యంతర భృతిని ఇవ్వాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేవీ భానుసింగ్ డిమాండ్ చేశారు. ఆదివారం పెన్షనర్ల సంఘం కార్యాలయంలో పెన్షనర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. కేవీ బానుసింగ్ మాట్లాడుతూ దీపావళి పండుగకు కనీసం రెండు డీఆర్‌ఎల్ (కరువు భత్యాలు) మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు సుబ్బరాయుడు, గాలయ్య, గోపాల్, దాస ప్ప, రామదాసురెడ్డి, మౌలాలి, అంజనేయులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి విరాళం



విరాళం అందజేస్తున్న శెట్టి విజయకుమార్

ఆళ్లగడ్డ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అహోబిలంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు, బలిజ నిత్యన్నదాన సత్రంలోని కల్యాణ మండపానికి అధ్యక్షుడు శెట్టి విజయ్‌కుమార్ ఆదివారం రూ.4 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లి జ్ఞాపకార్థంగా ప్రతి ఏటా పలు సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. సత్రం అభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్రం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

ఆళ్లగడ్డ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1978 సంవత్సరంలో విద్యను అభ్యసించి విద్యార్థులు 47 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. వివిధ ఉగ్యోగాలు, వ్యాపారాలలో స్థిరపడ్డ వారు ఓ చోటకు చేరి ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎద్దుల విక్రం దేవారెడ్డి, శ్రీనాథ్, రామకృష్ణారెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

